# విజయ-శతకం

డా.డి. విజయ్ భాస్కర్

**విజయశతకం**

***Dr.D. Vijay Bhaskar***

*First Edition* :
September, 2021

*Cover Design :*
*A. Giridhar*

*Published by :*

*Printed at*
**Sri Sri Printers**
VIJAYAWADA - 520 002
srisriprinters.vja@gmail.com
Cell : 9490634849

Rs :

# లోకబింబం "విజయశతకం"

డా॥ దీర్ఘాసి విజయభాస్కర్ గారు సుప్రసిద్ధనాటక రచయిత. ఉత్తమశ్రేణి కవీంద్రులు నిజాయితీతో బాధ్యతల్ని నిర్వర్తించిన రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారి. అన్నిటినీ మించి మానవతామూర్తి. అధికారదర్పాన్ని ఎన్నడూ ప్రదర్శించని నిరాడంబరులు నాకు మంచి మిత్రులు, నా శ్రేయోభిలాషి, నిత్యస్మితవదనులు, ఆంగ్ల సాహిత్య సముద్రాన్ని ఆపోశన పట్టిన అగస్త్యులు. ఆంధ్రసాహిత్య పారాన్ని ముట్టిన సాహితీవ్రతులు. ఆంధ్రాంగ్ల గ్రంథరచయితలు. పూర్వం పలు ప్రక్రియల్లో రచనలు చేసిన విజయభాస్కరగారు పదవీవిరమణ అనంతరం పద్యరచన చెయ్యటం అభినందనీయం. సహజంగా ప్రతిభావంతులైన వ్యక్తులకు ఛందస్సు ప్రతిబంధకం కాదని విజయభాస్కర్ గారు తాము రచించిన 'విజయశతకం' ద్వారా నిరూపించారు.

"విజయశతకం" అనే పేరుతో వెలువడుతున్న ఈ శతకంలో 108 పద్యాలున్నాయి. శతకమర్యాద ననుసరించి కవి గారు "వినగ రార సఖుడ విజయ వాక్కు" అనే మకుటాన్ని పొందుపరిచారు. ఇక్కడ 'విజయ వాక్కు' అవటంలో ఒక ఆంతర్యం ఉంది. విజయభాస్కర్ గారు చెప్పిన వాక్కు అనిగానీ, విజయానికి దారి తీసేవాక్కు అనిగానీ మకుటార్థాన్ని గ్రహించవచ్చు. పద్య నిర్మాణాన్ని గమనించినప్పుడు వీరికి పద్యం అలవోకగా స్వాధీనమైందని గుర్తించవచ్చు

*"ఆట వెలది జూడ అంత చిన్నదయిన*
*అర్థమిచ్చుగాదె అవధిమించి*
*చిన్న వారి సేవ చిన్నది కాబోదు*
*వినగ రార సఖుడ విజయ వాక్కు"* (82)

విజయభాస్కర్ గారి శతకం ఆటవెలది ఛందస్సులో సాగింది. అందుకే దాని ప్రాధాన్యాన్ని ఈ పద్యంలో వివరించారు. పద్యం చిన్నదైనా అపరిమితమైన అర్థాన్ని అందిస్తుందని చెప్పారు. రూపం ముఖ్యం కాదు దాని సారం ముఖ్యమైనదనే భావాన్ని గ్రహించాలని శతక కర్త తెలియజేశారు. అల్పాక్షరాల్లో అనల్పార్థ రచన చెయ్యగల అవకాశం ఆటవెలది ఛందస్సులో ఉంటుందని చెప్పకనే చెప్పారు.

'విజయభాస్కర్ గారు తమ విజ్ఞానసారాన్ని లోకానుభవాన్ని, రచనా నైపుణ్యాన్ని జోడించి ఈశతకాన్ని రచించినట్లు తెలుస్తున్నది. కోట్ల సంవత్సరాల క్రితం గోళరూపంలో ఉన్న విశ్వం విస్ఫోటనం చెంది విశ్వమైందని చెబుతూ శతకాన్ని ప్రారంభించారు. ఈ శతకంలో విశ్వపరిణామం, భిన్నసంస్కృతులు, మతాలు, శంకరాచార్యుని వృత్తాంతం, తల్లి భాష ప్రాముఖ్యం, దానవిశిష్టత, ఆత్మతత్త్వం, ధార్మికత, మనిషిబాధ, పూర్ణతత్వం మొదలైన అంశాలతో పాటు లోకరీతి స్పష్టమవుతున్నది. కవికి లోకజ్ఞత తోడైతే ఉత్తమ శ్రేణి కవిత్వం వెలువడు తుందని చెప్పటానికి 'విజయశతకం' ప్రత్యక్ష సాక్ష్యం.

ఈశతకంలో ప్రబోధాత్మకవైన పద్యాలున్నాయి. వ్యక్తిత్వవికాసాన్ని సూచించే పద్యాలున్నాయి.

*"కార్య సాధకుండు కాబోవు పనికిని*
*ఒడలు వంచు చుండు ఓర్మి తోడ*
*ఎంత లోతు వంగు ఏతాము నీళ్ళకై*
*వినగ రార సఖుడ విజయ వాక్కు"* (13)

కార్యసాధకుడు ఎంతకష్టానికైనా సిద్ధపడతాడని చెప్పి దానికి దృష్టాంతంగా ఏతాము నీళ్ళ కోసం ఎంతో లోతుకు వంగుతుందని చెపిన పద్యం ఒక వ్యక్తి ఉత్తమ ఫలితాల్ని సాధించాలంటే ఎంత కష్టానికై సిద్ధంగా ఉండాలనే ప్రబోధాన్ని అందిస్తుంది. ముందుగా మాతృభాషను నేర్చి తర్వాత ఇతర భాషల్ని నేర్చుకుంటే సూర్యునిలా వెలుగొందుతాడని చెబుతూ కవిగారు,

*"ఎన్ని పల్కులున్న మిన్న అమ్మనుడి యె*
*తల్లి నుడిని తలను దాల్చు వాడు*
*ఇతర నుడులు నేర్వ ఇనుడయి వెలుగురా"*

అనే పదాన్ని సరళ సుందర శైలిలో రచించారు.

విజయభాస్కర్ గారి పద్యాల్లోని మూడవ పాదం వారి ప్రతిభకు తార్కాణంగా నిలిచి వేమనను గుర్తుకు తెస్తుందని చెప్పటం సముచితం.

*"కులము లేదునాడు కూరిమి కలదురా*
*ముందు కేగినపుడు మున్నీరు ముంచురా*
*రంధ్రమైన వెదురు రమ్యమై పాడదా*
*తృష్ణ లేని బలము కృష్ణబిలమ్మురా*
*బతుకు కంటె మనకు బడిపంతు లెవరురా*
*భార్యరాగ తల్లి బతుకుట నేరమా"* – ఇలా ఎన్నైనా చూపవచ్చు.

విజయభాస్కర్ గారు రచించిన 'విజయశతకం' సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆహ్వానించదగింది. అవశ్యం పఠించదగింది. ఆచరించదగింది. మొదటి శతక రచనతోనే ఉత్తమకవిగా నిరూపించుకున్న విజయభాస్కర్ గారి ప్రతిభ ప్రశంసనీయం. వీరి శతకానికి నా అభిప్రాయాన్ని రచించమని సస్నేహంగా కోరటం నా అదృష్టంగా భావిస్తున్నాను. వీరి కలం నుంచి మరిన్ని పద్యరచనలు రావాలని ఆకాంక్షిస్తున్నాను.

**– డా॥ గుమ్మా సాంబశివరావు**

# విజయశతకం

1) కోట్ల యేళ్ల నాడు గోళ రూప మొకటి
విస్ఫుటనము జెంది విశ్వమయ్యె
దైవమెక్కడున్న దీవించకుండునా
వినగ రారా సఖుడ విజయ వాక్కు

2) పంచ భూతములవి పాలించు చుండగ
ఆకసాన అర్కుడలరు చుండ
విశ్వమంత గొప్ప వింతయే గాంచగ
వినగ రారా సఖుడ విజయ వాక్కు

3) వేద కాల మందు వివిధ ప్రవృత్తులు
నెరపు చుండిరొక్క నీడ క్రింద
కులము లేదు నాడు కూరిమి కలదురా
వినగ రారా సఖుడ విజయ వాక్కు

4) విరిసె లోక మందు వివిధమౌ సంస్కృతుల్
అందు సింధు నిలిచె అగ్రగామి
మెసపు గ్రీకు రోము మేదిని కలిసెరా
వినగ రారా సఖుడ విజయ వాక్కు

5) బుద్ధ చర్వాక జిన బోధలణచి వేసి
ఇతర వాద మెల్ల ఎండ గట్టి
వేద మతము పెరిగి విస్తృతి పొందె
వినగ రార సఖుడ విజయ వాక్కు

6) ఇష్ట దైవ మనుచు నిష్ట పూజలతోడ
నీవు మొక్కు బొమ్మ నిజము రూపు
ఏది? గతము నందు యే మత దైవమొ
వినగ రార సఖుడ విజయ వాక్కు

7) పుట్టు వెరుక లేక పుడమి జ్ఞానము రాదు
మోక్షమన్న మాట మోసమరయ
పుటక లెన్ని యున్న పుట్టుటే మేల్గొర్చు
వినగ రార సఖుడ విజయ వాక్కు

8) అలల పాటు రీతి ఆధ్యాత్మికత దృష్టి
హెచ్చు మనసులోన హేతు పుష్టి
తగిన పాళ్ళ రెండు తాదాల్చ శీలమౌ
వినగ రార సఖుడ విజయ వాక్కు

9) పితరు డెవరు తేల్చ పిచ్చిగా శోధించి
జగతి ఎట్లు బొందె జన్మ మనుచు
చేయు వెతుకు లాట చెడె మత మౌఢ్యమై
వినగ రార సఖుడ విజయ వాక్కు

10) వేద ఘోష గరిమ వ్రేల్చిన యజ్ఞమా?
ఉపనిషత్తు మాట ఉత్తమంబు
జంతు బలుల బదులు జ్ఞాన బల్మి పెరిగె
వినగ రార సఖుడ విజయ వాక్కు

11) జగతి నందు నెపుడు సత్య మొకటె యంచు
విప్ర వాక్కు వినమె వివిధ రీతి,
పరమ సత్య మిదిగ పరమాత్మ తెల్పునా ?
వినగ రార సఖుడ విజయ వాక్కు

12) వర్ణ ధర్మ మనుచు వంతులేయ సిరులు
అగ్ర భాగ మెల్ల అధికుల గతి
బడుగు తనము పాప ఫలమన ఘోరమౌ
వినగ రార సఖుడ విజయ వాక్కు

13) కార్య సాధకుండు కాబోవు పనికిని
ఒడలు వంచు చుండు ఓర్మి తోడ
ఎంత లోతు వంగు ఏతాము నీళ్ళకై
వినగ రార సఖుడ విజయ వాక్కు

14) నీటి కొరకు చెట్టు నిన్నడుగదెపుడు
నీట పుట్టి నాచు నెగడు చుండు
తెలివి ఉన్న వాడు తెలియడా బ్రతుకును
వినగ రార సఖుడ విజయ వాక్కు

15) భక్తి తత్వ మందు భజన చేయగ వచ్చు
జ్ఞాన మార్గ మొసగు జ్ఞాన సుధలు
కర్మ చేయు వాడె కడుపు నింపు ఘనుడు
వినగ రార సఖుడ విజయ వాక్కు

16) తేటి తేనె తెచ్చి తెలుప దెవ్వ రికిని
మంచి పనులు చేయు మనుజు డెపుడు
మదిని తలచు గాని మందితో పలుకునా?
వినగ రార సఖుడ విజయ వాక్కు

17) వేద మతము నందు వేలాది వేల్పులు
ధరణి యందు గొప్ప ధర్మ నిరతి
పేద వారి పట్ల పీడన మది యేమి ?
వినగ రార సఖుడ విజయ వాక్కు

18) దొరకు దాని నెల్ల దుగ్ధ తోడ గొనుచు
పంత మొనర బూని పట్ట నేల
పట్టి ఉంచ గాలి ప్రాణముల్ పో గొట్టు
వినగ రార సఖుడ విజయ వాక్కు

19) తీరమందు మనిషి తీరుగా నిల్చిన
కాళ్లు కడిగి కడలి గౌర వించు
ముందు కేగి నపుడు మున్నీరు ముంచురా
వినగ రార సఖుడ! విజయ వాక్కు!

20) చెట్టు చేమ తోడ చేసెడి చెలిమితో
ఆత్మ కలిమి యెంతొ అతిశయించు
పట్టి చూసి నపుడు ప్రకృతియే పరమాత్మ
వినగ రార సఖుడ! విజయ వాక్కు!

21) కలిమి కూడ బెట్ట కావలె నెన్నియో
మంచి వాడు కాగ మనసు చాలు
లోన దాని వదిలి లోకాన పడనేల ?
వినగ రార సఖుడ విజయ వాక్కు

22) కార్య పాల నమున కర్తవ్య దీక్ష లో
దాన ధర్మమందు దయను దెలుప
దొడ్డ వైతి వేని దొరుకును దైవమ్ము
వినగ రార సఖుడ విజయ వాక్కు

23) ఖైదు నందు పెట్టి కానుక లెందుకు ?
ముక్కు మూయునట్టి ముక్కె రేల ?
స్వేచ్ఛ కన్న మనకు స్వచ్ఛ సుందర మేది ?
వినగ రార సఖుడ విజయ వాక్కు

24) కనులు రెండు గాని కాంచ చూపొక్కటే
కష్ట సుఖము లందు కలిసి యుండు
ఒక్క దాని నొకటి నిక్కి చూడగ లేవు
వినగ రార సఖుడ విజయ వాక్కు

25) కష్ట మయ్యె నేని కన్నీరు కార్చకు
వేద నొంది మనసు వెరవ వలదు
రంధ్ర మైన వెదురు రమ్యమై పాడదా ?
వినగ రార సఖుడ విజయ వాక్కు

26) అంత్య కులజు డొక్క డగుపించు నందాక
శంక తీర లేదు శంక రునికి
చివర నున్న ప్రాణి చిన్మయ రూపము
వినగ రార సఖుడ విజయ వాక్కు

27) మాయ యన్న మాట మహిమ తెల్పగ రాదు!
తలపు మాత్రముననె తలను మ్రింగు
లోక దృష్టి గనని లోతైన మాటరా
వినగ రార సఖుడ విజయ వాక్కు

28) మరల మరల పుట్టి మట్టి లో గలయుట
అంతు ఆది లేని తంతు గదర
కోర్కె మిగిలి కాదు కొంచెమౌ జీవికి
వినగ రార సఖుడ విజయ వాక్కు

29) ఆర్యులొసగినట్టి వతిలోక భావాలు
ధరణి నమ్మి సాగె ద్రవిడ జాతి
భరత మాత రెంటి భవ్య నవ్య చరిత
వినగ రార సఖుడ విజయ వాక్కు

30) ప్రాణమున్న వరకు పారి పోవవెపుడు
బాల్య మందు విద్య బాగ అబ్బు
పూవు నొదిలి ఎటకు పోదుగా పరిమళం
వినగ రార సఖుడ విజయ వాక్కు

31) ఎవరు దీని శిల్పి ? ఏది గలదురూపు ?
మాట పాట బాట మర్మమెవరు
తేల్చే దమని చనియు తిరిగి రారెవ్వరు
వినగ రార సఖుడ విజయ వాక్కు

32) పుటక ఎంత హాయి పోవుట కడునోయి
జననవేళ నవ్వు జతగ చావు
సహజ యాత్ర చేయ సంబర మదిలేదు
వినగ రార సఖుడ విజయ వాక్కు

33) బయట, లోన నొక్క బ్రహ్మాండ మయ్యెదె
స్థల కాలములె అసత్యములగు
మనుజుని తుది స్థాన మదియె జూడుమికను
వినగ రార సఖుడ విజయ వాక్కు

34) మౌన మనగ మూగ మార్గము కాదది.
మనసు మనసు తోడ మాట లాడు
అర్థ వంత మైన ఆత్మీయ భాషరా
వినగ రార సఖుడ విజయ వాక్కు

35) దైవ భక్తి తోడ దవ్వుగా బోవలె
ప్రజల మనసు నందు పాప చింత
పరుగు పెట్టి అయ్యొ ! పాప భీతి యరిగె
వినగ రార సఖుడ విజయ వాక్కు

36) సృష్టి నెవడెరుంగు చివరి ప్రళయ వేళ?
వీలు గాదు తెలుప విస్ఫుటనపు
వేడి, జగతి మొదలు వివరింప నౌనొకో ?
వినగ రార సఖుడ విజయ వాక్కు

37) అణువు లోని శక్తి అంతమై పోవగా
చూర గొనుట మాని సొమ్మసిల్లి
తృష్ణ లేని బలము కృష్ణ బిలమ్మురా
వినగ రార సఖుడ విజయ వాక్కు

38) వెలుపలున్న యపుడు వెఱ్ఱి వాయువగును
ఆయువయ్యె నదియె అంతరమున
జీవ ! గాలి యునికి జీవన మరణమ్ము
వినగ రార సఖుడ విజయ వాక్కు

39) దేవుడెచట యనుచు దేవులాటలవేల
ఇంట నీశు లీల నెరుగ వేల ?
తెరువు యెరిగెనేని తెలియును నిజమది
వినగ రార సఖుడ విజయ వాక్కు

40) కడలి లోని అలలు కదలెడుతీరులో
బయలు దేరు చోట పాయుచుండు
కనగ కుదుపు తప్ప కదలలేనిది ఆత్మ
వినగ రార సఖుడ విజయ వాక్కు

41) తల్లి దండ్రి ఋణము దైవమ్ము ఋణమును
దేశ మాత ఋణము దేహ ఋణము
తీర్చు నట్టి వాడె ధీరుడౌ మనుజుడు
వినగ రార సఖుడ విజయ వాక్కు

42) మేఘ మందు మెరుపు మెరిసిన రీతిగా
కంట కో పమదియె కదల వలెను
గుండె గూడు నందు గూడు కట్టిన చేటు
వినగ రార సఖుడ విజయ వాక్కు

43) మనిషి జ్ఞాన మొందు మార్గాలు రెండుండు
వేదనమ్ము కంటె వేదమేది
బ్రతుకు కంటె మనకు బడి పంతులెవరురా ?
వినగ రార సఖుడ విజయ వాక్కు

44) అమ్ములపొదిలోన అమరిన బాణమ్ము
విడువకున్న దాని విలువ యేది ?
ఖర్చు కాని ధనము ఘనము గాకుండు
వినగ రార సఖుడ విజయ వాక్కు

45)	ఇహము నందు వచ్చు ఇబ్బందు లన్నిట
కలవు వెతక ఇచట కారణములు
జగము చూడ మాని జన్మల జల్లెడా ?
వినగ రార సఖుడ విజయ వాక్కు

46)	దేవ తాంశ యనుచు దేనినైన మ్రొక్క
మూర్ఖ మనుచు చెప్పి ముదము చెందు
సకల సృష్టి జూడ సర్వేశు రూపమే
వినగ రార సఖుడ విజయ వాక్కు

47)	దొసగు లెంచు దొరలు దొరకొనరాత్మలో
ఎంత గొప్ప వాడు చెంత నున్న,
గుర్రు మనును గదర కుక్కలెందైనను
వినగ రార సఖుడ విజయ వాక్కు

48)	సాధన మొకటె కాదు సంగీతమన నిల
శ్రుతుల లయల యందు శోభ కలుగ
రసము లూరు రమ్య రాగవిస్తృతిలోన
వినగ రార సఖుడ విజయ వాక్కు

49) బధిరు డెవడొ తెలియు బాగుగ యోచింప
మాట వినగ రాని మనుజుడగున?
మంచి వినని వాడె మహా బధిరుడుగా
వినగ రార సఖుడ విజయ వాక్కు

50) అల్పు లనియు నంట అర్హత లేదని
కొంత మంది జనుల కొరత వేసి
సభ్య సంఘ మెల్ల సన్న బోయెను నేడు
వినగ రార సఖుడ విజయ వాక్కు

51) ధరణి నేలిరి కడు ధర్మపరాయణుల్
దళిత దృష్టి సుంత తగ్గ లేదు
మార లేదు వారి బ్రతుకులేనాడును
వినగ రార సఖుడ విజయ వాక్కు

52) విద్య పేర తొలుత విభజన కల్లెనా !
కులము కూల్చే జాతి బలము నెల్ల
గతము దిద్ద కున్న గతులేడ యుండును?
వినగ రార సఖుడ విజయ వాక్కు

53) వేద విదుల మనుచు వేయి నీతులు జెప్పి
చెమట నోడ్చు వాని ఛీత్కరించి
మాట మంత్ర మగుచు మహిని పాలించెరా
వినగ రార సఖుడ విజయ వాక్కు

54) పూర్ణ మదియు, ఇదియు పూర్ణమె పరికించ
పూర్ణ మందు పుట్టె పూర్ణ మెల్ల
వెలితి కాంచ లేము వెల్గుపూర్ణమగుచో
వినగ రార సఖుడ విజయ వాక్కు

55) తిట్టు కన్న నిన్ను తిట్టెనన్న తలంపు
మదిని తొలుచు చుండు మరల మరల
మనిషి బాధ పెరుగు మథనమందుకదరా
వినగ రార సఖుడ విజయ వాక్కు

56) ప్రాప్త మగును లెమ్ము ప్రారంభమునుజేయ
నీరు నేల నింగి నీకు దక్కు
పాత పడిన మాట ప్రారబ్ధ మనుటరా!
వినగ రార సఖుడ విజయ వాక్కు

57) గడ్డి పోచ యనుచు గుడ్డిగా పల్కకు
వరద వచ్చి నపుడు వంగి నిలుచు
అణిగి ఉన్న వాటికి ఆపదలుండునా ?
వినగ రార సఖుడ విజయ వాక్కు

58) తల్లి గర్భమందు తొల్లి నేర్చెడి భాష
తేటమౌ తలపుల తెలుపు భాష
తల్లి భాష నరుల తరగని సంపదౌ
వినగ రార సఖుడ విజయ వాక్కు

59) విశ్వ విస్తరణము శాశ్వతంబును గాదు
కొంత దూరమేగి కొంచెమగును
ఇంటి ముఖము పట్టె మింట నున్నది యెల్ల
వినగ రార సఖుడ విజయ వాక్కు

60) ఆది 'బ్రహ్మ' మనగ అర్థంబు మంత్రము
అర్థ మరయ జూడ 'ఆత్మ' శ్వాస
అర్థ యుక్తి మారి అందలమెక్కెరా
వినగ రార సఖుడ విజయ వాక్కు

61) పంచ వలయు పొలము పసిడి ధనములాది
భవన, భూమి భోగ భాగ్య మెల్ల
సంఘ మందు సమత సాధింప గోరుచో
వినగ రార సఖుడ విజయ వాక్కు

62) తల్లి కడుపు నందు తపము చేయుచునుండ
నెలకు నొక్క రసము నేర్చు నరుడు
నవ రసములు నేర్వ నవ మాసములగును
వినగ రార సఖుడ విజయ వాక్కు

63) పిచుక గూడు పోదు భీకర ప్రళయాన,
వాన కొంత పెరుగ వంతెన పడు
ప్రభుత ఘనత పిట్ట పాటిది కాదాయె
వినగ రార సఖుడ విజయ వాక్కు

64) నీతి యనెడు దాని గోతిలో కప్పినా
భీతి లేక వెలుగు జ్యోతి బోలె
నిప్పు నెవడు తనదు గుప్పెటన్ బంధించు
వినగ రార సఖుడ విజయ వాక్కు

65) పూలు తెచ్చి భక్తి పూజ చేయుట కంటె
నోము లెన్నొ ఇంట నోచు కంటె
ఆకలి గొను వారి కన్నమిడుట మేలు
వినగ రార సఖుడ విజయ వాక్కు

66) రమణు లెంత సుందరంబుగ నున్నను
పెండ్లి యాడు వారు పేచి పెట్టి
రొక్క మడుగు తీరు వెక్కసంబుగలేద ?
వినగ రార సఖుడ విజయ వాక్కు

67) లోక మందు జీవి లోనౌ నిడుములకు
గతము జన్మ కర్మ గతులటంచు;
అయిన జన్మలెత్త్తి అలసి పోవదు సుమ్మి
వినగరార సఖుడ విజయ వాక్కు

68) పెక్కు బాటలందు విహరించు వ్యాఖ్యల
బుద్ధ బోధ దించె భూమి మీద
కష్టములను బాపె అష్టాంగ మార్గాన
వినగ రార సఖుడ విజయ వాక్కు

69) మంచి వారి కెపుడు మంచియే బ్రతుకగు
ఖలుని లోన విషము కలిసి యుండు
ఉప్పు నీట కరిగి ఉనికిని చాటదా ?
వినగ రార సఖుడ విజయ వాక్కు

70) కళ్ళ ముందు బొమ్మ కాంచిన దనుకోకు
మహిని ఉన్నదంత మారుచుండు
మార్పొకటియె ఎపుడు మారని సూత్రంబు
వినగ రార సఖుడ విజయ వాక్కు

71) ఆత్మ తత్వమనగ అర్థంబు నెరుగుము
జన్మ పిదప దాల్చు జన్మ కాదు
జన్మ జన్మలందు సాంద్రమౌ చేతన
వినగ రార సఖుడ విజయ వాక్కు

72) పంట రైతు దన్న వంటకెయ్యది దిక్కు
కుండ సేయ కున్న వండు టెట్లు ?
శూద్ర జాతి శ్రమలె, శుభసౌఖ్యములుగూర్చు
వినగ రార సఖుడ విజయ వాక్కు

73) తనివి తీర పాలు త్రాగుబిడ్డడపుడు
తల్లి రొమ్ము మార్చ తల్లడిల్లు
ప్రాణి వేద నంతె ప్రాణ మేగినపుడు
వినగ రార సఖుడ విజయ వాక్కు

74) బ్రహ్మ , ఆత్మ వంటి భావనలవి తగ్గి
మనిషి ఉనికి ప్రముఖ మనగ నేటి
ఆధునికత జూపె అస్తిత్వవాదమ్ము
వినగ రార సఖుడ విజయ వాక్కు

75) ఆంగ్ల భాష మోహ మాంధ్రుల శాపమా ?
తెలుగు దాని సాటి వెలుగ లేద?
భార్య రాగ తల్లి బతుకుట నేరమా ?
వినగ రార సఖుడ విజయ వాక్కు

76) ఎన్ని పల్కు లున్న మిన్న అమ్మనుడియె
తల్లి నుడిని తలను దాల్చు వాడు
ఇతర నుడులు నేర్వ ఇనుడయి వెలుగురా!
వినగ రార సఖుడ విజయ వాక్కు

77) పరమ పురుషుడెవడు పరమాత్మ ఎవ్వడు
పట్టి ప్రశ్న వేయ పరుగు తీసి
నిన్ను జూచి నిలిచె నింగిలో దేవుడై
వినగ రార సఖుడ విజయ వాక్కు

78) ఆలు బిడ్డ లౌదు రవినీతి మూలము
ప్రజల కన్న వారె ప్రబల మౌదు
రవని నేలు హక్కు అవివాహితుడిదయా !
వినగ రార సఖుడ విజయ వాక్కు

79) భావ భ్రష్టు లేపుడు భ్రాంతికి లోనయి
నియమ నిష్ఠ స్వామి నీతిమంద్రు
పారిశుధ్య మందు పరమాత్ముడుండురా
వినగ రార సఖుడ విజయ వాక్కు

80) దేవుడనగ మనిషి దీప్తికై జంఝాట
ఇహము పరము పేర ఈదు లాట
జగములున్నవరకు సాగు మతములాట
వినగ రార సఖుడ విజయ వాక్కు

81) కులము మతము లందు కూర్మి నెలకొనగ
సకల జనుల కిలను సౌఖ్యముండు
పూర్వ ఘనత చెప్ప పూనురా రోగమ్ము !
వినగ రార సఖుడ విజయ వాక్కు

82) ఆట వెలది జూడ అంత చిన్నదయిన
అర్థమిచ్చు గాదె అవధిమించి
చిన్న వారి సేవ చిన్నది కాబోదు
వినగ రార సఖుడ విజయ వాక్కు

83) సిరుల లోన నీకు శ్రీ సుఖములు దక్కు
మోహమందు మనసు మోహరించు
ధరణి లేని దేది ధార్మికుడైనచో !
వినగ రార సఖుడ విజయ వాక్కు

84) నారి నాభి జూసి నాలుకన్ జాపుచు
రొమ్ములు రస నిర్భరమ్ములనుచు
భ్రమసి నట్టి బ్రతుకు భ్రష్టమౌ నెప్పుడు
వినగ రార సఖుడ విజయ వాక్కు

85) నిత్యమనుచు తలచి నిశ్చింత పొందకు
కళ్ళు కనని మార్పు కలదు వెనుక
కంట జిక్కని మెలి కలవి మింట తెలియు
వినగ రార సఖుడ విజయ వాక్కు

86) సృష్టి మర్మమెల్ల దృష్టి కందగ జేయు
తత్వ శాస్త్ర మెల్ల తపన జెందు
పెద్ద లందు దూరి పెడదారి పట్టించు
వినగ రార సఖుడ విజయ వాక్కు

87) నరుల కెల్ల లేని నాకము నాకేల
యనుచు అవని జనులు వినగ పలికి
రామసామ్య మొందె రామానుజస్వామి
వినగ రార సఖుడ విజయ వాక్కు

88) ఒడ్డునున్న పడవ ఒద్దిక మీదుండు
నీట సాగు దాని పాటు వేరు
చెమ్మ తగల నమ్మ చెప్పదా ముచ్చట్లు
వినగ రార సఖుడ విజయ వాక్కు

89) నడక తోడ కల్లె నరుల నాగరికత
సంచరించ పెరిగె సకల జగతి
నిలకడాపలేదె ఇలను అన్వేషణ
వినగ రార సఖుడ విజయ వాక్కు

90) “మాట” పదము కాదు మనిషి మనసదిరా !
మంట మందు, తగులు మాట ఈటె
వెలుగు, నిశియు వేన వేలుమాటమహిమ
వినగ రార సఖుడ విజయ వాక్కు

91) మోక్ష మిదియె యనెడి మొనగాడిల గలడా?
దేహ దశను తెలుపు ధీరు డెవడు ?
విడిది ఇంటి నుండి విడుదలే మోక్షమా ?
వినగ రార సఖుడ విజయ వాక్కు

92) చెట్టు నేల గూలి మట్టిలో కూర్కొని
అగ్గి సెగల మధ్య బొగ్గ గుచును
వచ్చు కదర మరల వజ్రకాంతులిడుచు
వినగ రార సఖుడ విజయ వాక్కు

93) భారతీయ తత్వ వార సత్వ మెరుగు
సకల వృత్తి జనుల సంపద యది
ఒక్క కులము గొప్ప నొల్ల బోకెప్పుడు
వినగ రార సఖుడ విజయ వాక్కు

94) దేవ కన్య యొకతె దీపమున్ చేదాల్చి
పోసి ప్రాణ కాంతి పోవుచుండు
వత్తి కొడియ గట్ట రిత్తమౌ ప్రాణముల్
వినగ రార సఖుడ విజయ వాక్కు

95) సృష్టి హేతు వేదొ దృష్టి పెట్టవలెను
పాత వా దనలను పాత రేసి
నిగ్గు తేల్చ వలెను నిర్వికారుడెవరో
వినగ రార సఖుడ విజయ వక్కు

96) నిజము, దేవతలకు నిమ్నోన్నతలు గల
వగ్ని వరుణ ఇంద్రు లగ్గు వగుచు
బ్రహ్మ విష్ణు శివులు బ్రహ్మాండమాయిరి
వినగ రార సఖుడ విజయ వాక్కు

97) గుళ్ళు లేని బ్రహ్మ గుళ్ళ బోయె నిలను
స్థితియు లయయు విష్ణు శివుల కంది
ఆలయాలు వెలిసి ఆరాధన పెరిగె
వినగ రార సఖుడ విజయ వాక్కు

98) మూల ధాతు సంఖ్య మూలకమును దెల్పు
అణువులమరి వెలసె ఆ తొలి వల,
పరవశించి మారె ప్రాకృ త స్థితి యెల్ల
వినగ రార సఖుడ విజయ వాక్కు

99) సంఘ మెంతొ నాకు సమకూర్చె లోకాన
ఇవ్వ లేదు నేను ఇంత కింత
జనులు తీర్చ నగునె జన్మ భూమి ఋణము
వినగ రార సఖుడ విజయ వాక్కు

100) సరళ రేఖ ఎపుడు సాగు వంపు లుడిగి
బొమ్మ గీయ లేదు అమ్మ తోడు
వక్ర గతికి మార వచ్చునాకారముల్
వినగ రార సఖుడ విజయ వాక్కు

101) గాలి మొలక యొకటి గగన సీమల నుండి
యోగ సిద్ధి పొంది యోని నందు
జీవ ధాత్రి యందు జీవియై వికసించు
వినగ రార సఖుడ విజయ వాక్కు

102) పుట్టు చోటు వదిలి పుడమినంత తిరుగు
వలస పక్షి వోలె వైనమెరిగి;
ఊరు మేర లేల? ఉర్వియే నీదౌను
వినగ రార సఖుడ విజయ వాక్కు

103) మొన్న కన్న నిన్న, నిన్నకంటెను నేడు,
నేటి మేటి విలువ దాటి రేపు
కాల గంగ సాగు కళలనింపుకొనుచు!
వినగ రార సఖుడ విజయ వాక్కు

104) మున్ను యేల్బడులవి యెన్ని కల్గిన శూద్ర,
మహిళ, దళిత బ్రతుకు మారలేదు
ఆంగ్ల విద్య దెచ్చె ఆధునికత నిట
వినగ రార సఖుడ విజయ వాక్కు

105) వేల యేండ్లు గడిచె వెట్టి సేవల లోన
చూడ సాటి గలదె శూద్ర కృషికి
వారి ఋణము తీర్చు వాణీపతి ఎవడు ?
వినగ రార సఖుడ విజయ వాక్కు

106) ఉన్న మతము లోన చిన్న చూపు కలచ
సొంత మతము మారు చింత విడిచి
మతపు చూపు మార్చి మతపెద్దయై నిల్చు
వినగ రార సఖుడ విజయ వాక్కు

107) మేఘ యవనిక గన మేల్మిగా దోచును
నల్ల మబ్బు వెనుక చల్ల గుండు
మనిషి లోన చెడ్డ మబ్బుయై మసలురా
వినగ రార సఖుడ విజయ వాక్కు

108) నీల్గి నిక్కి మూల్గి నిరుపమ హొయితో
నవ్వి నవ్వగ నవ నాడు లలసి
చివరి ఏడ్పు శ్రేష్ట శృంగార చేష్టరా
వినగ రార సఖుడ విజయ వాక్కు

**-: సమాప్తం :-**